కొనసాగుతున్న పూడికతీత

- రూ. 60 లక్షల నిధుల కేటాయింపు
- ఇప్పటికే పనులు ప్రారంభం


పులాంగ్ వాగులో జేసీబీ సహాయంతో పూడికతీత

నిజామాబాద్‌నాగారం: చిన్నపాటి వర్షాలకే నగరం జలమయంగా మారుతోంది. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడుతుంది. పెద్ద పెద్ద మురుగుకాలువలన్నీ అస్తవ్యస్తంగా మారాయి. చిన్న చిన్న డ్రైనేజీల్లో నీరు సక్రమంగా వెళ్లడం లేదు. దీంతో ప్రతి ఏడాది వర్షాకాలం వస్తే చాలు నగర ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్‌శాఖ బడ్జెట్‌లో పూడికతీత పనులకు ప్రతి ఏడాది సుమారుగా రూ. 60లక్షలపైనే నిధులు కేటాయిస్తున్నారు. ఈ నిధులతో ప్రస్తుతం మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

నగరంలో 60 డివిజన్లు.. సుమారు 4 లక్షల జనాభా ఉంది. 6 జోన్ కార్యాలయాలున్నాయి. ఒక్కో జోన్‌లో పూడికతీత కోసం సుమారుగా రూ.8 లక్షల నుంచి 12లక్షల వరకు నిధులు కేటాయించారు.

నగరంలో కాలువల పరిస్థితి..	450	220	15
	పక్కాగా ఉన్న కాలువలు (కిలోమీటర్లు)	కచ్చా కాలువలు (కిలోమీటర్లు)	వరద కాలువలు (కిలోమీటర్లు)


నగరంలో పూడిక తీయడంతో వచ్చిన మట్టి

నాలుగో జోన్ పెద్దది కావడంతో రూ. 20లక్షల వరకు కేటాయించినట్లు తెలిసింది. మొత్తం రూ.60లక్షల నిధులతో మే, జూన్, జూలై నెలలో పూడికతీత పనులు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ఇంజనీరింగ్‌శాఖ అధికారులు పూర్తి చేశారు.

కాలువలు బాగా లేకపోవడమే కారణం..

శివారు కాలనీలు ఆటోనగర్, ధర్మపురిహిల్స్, నాగారం, అర్సపల్లి, చంద్రశేఖర్‌కాలనీ, గౌతం నగర్, దుబ్బ తదితర ప్రాంతాల్లో చిన్నపాటి వర్షాలకే కాలనీల్లో నీరు వచ్చి చేరుతోంది. కాలువలు సక్రమంగా లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. డ్రైనేజీ వ్యవస్థ ఇప్పటికీ చాలా చోట్ల అస్తవ్యస్థంగా ఉంది. డీ–51, డీ–52, డీ–53, డీ–54 కెనాల్స్, పులాంగ్ లాంటి వాగులు సైతం కబ్జాలతో చిన్న చిన్న కాలువల మాదిరిగా మారిపోయాయి. దీంతో నగరం నడిబొడ్డున అంటే బస్టాండ్, ఖలీల్‌వాడి, రైల్వేస్టేషన్, పులాంగ్, బోధన్ రోడ్ తదితర ప్రాంతాలు వర్షాలు పడితే చెరువులు, కుంటలు తలపించేలా నీరు నిల్వ ఉంటోంది.

సక్రమంగా తీయాల్సిందే

పూడికతీత పనులు సక్రమంగా చేయాల్సిందే. కాంట్రాక్టర్లు పనులు సక్రమంగా చేయకుంటే కచ్చితంగా శాఖాపరమైన చర్యలు ఉంటాయి. ఎక్కడెక్కడ పనులు జరుగుతున్నాయో పరిశీలన చేయాలని ఆదేశాలిస్తున్నాం.

– మురళీ మోహన్, ఇంజినీరింగ్ ఈఈ

క్లుప్తంగా

ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను కలిసిన సీపీఐ నేత



ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని గురువారం సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య కలిశారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం–మీడియా సెమినార్‌కు విచ్చేసిన శ్రీనివాస్ రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



డిచ్‌పల్లి: బర్ధిపూర్ సహకారం సంఘం(సొసైటీ) ఆధ్వర్యంలో ప్రభుత్వం సబ్సిడీపై అందించిన జీలుగ విత్తనాలను గురువారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ.. 30 కిలోల బస్తాకు రూ.2,790లు ఉండగా ప్రభుత్వం సబ్సిడీపై రూ.1,116లకే అందిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ పరిధిలోని బర్ధిపూర్, ధర్మారం(బి), ఆరేపల్లి గ్రామాల రైతులు మండల వ్యవసాయశాఖ ద్వారా పర్మిట్ తీసుకుని జీలుగ విత్తనాలు పొందాలని ఆయన సూచించారు. సొసైటీ కార్యదర్శి నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బర్ధీపూర్ సీఎస్ఐ చర్చి వార్షికోత్సవం



డిచ్‌పల్లి: బర్ధీపూర్ గ్రామంలో గల సీఎస్ఐ వెస్లీ చర్చి 9వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రెసిబిటర్ ఇన్‌చార్జి, జీడీసీసీ సండే స్కూల్ సెక్రటరీ రెవరెండ్ జీ.దినకర్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు కేక్ కట్ చేసి, మిఠాయిలను పంచి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జీడీసీసీ చైర్మన్ రెవరెండ్ వి.సామ్యేల్ మాట్లాడుతూ.. దేవుని ఆరాధించి, ప్రార్థించి, పాపాలు ఒప్పుకుని పరిశుద్ధంగా దీవించడానికి చర్చి కేంద్రమై ఉంటుందన్నారు. చర్చి విశిష్టతను వివరించారు. వేడుకల్లో మహిళలు ప్రత్యేక గీతాలు ఆలపించారు. అనంతరం సభ్యులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పంచశీల జెండా ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని పోచమ్మ గల్లి ఎస్సీ మాల సంఘం ఆధ్వర్యంలో తథాగత గౌతమ బుద్ధుడి జయంతి, బుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని గురువారం ఘనంగా పంచశీల జెండా ఆవిష్కరణ, బుద్ధ వందనం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ పులి జైపాల్, ప్రధాన కార్యదర్శి నీలగిరి సాయికిరణ్, సంఘం గౌరవ అధ్యక్షుడు బక్కోల గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరంజన్, అడ్వైజర్స్ నీలగిరి రాజు, సుబ్బారావు, తర్ల రమేష్, ప్రవీణ్ కుమార్, నీలకంఠం, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో అన్నదానం



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని న్యాల్‌కల్ కోదండ రామాలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర పౌర్ణమి అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున అన్నదానం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కొమ్ము సుధాకర్ గుప్తా, సంఘ సభ్యులు తెలిపారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి విరాళం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన గడ్డం సంతోష్‌రెడ్డి రూ. 25 వేల విరాళాన్ని తనవంతు సహాయంగా కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. దీంతో కమిటీ సభ్యులు దాత సంతోష్‌రెడ్డి, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న స్థానిక బీజేపీ నాయకుడు ముస్కు నర్సయ్యను సన్మానించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, పీడీ రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం..



"రోడ్డుపైనే చెత్తాచెదారం..."

నగరంలోని వీక్లీమార్కెట్ పక్కన గల్లీలోకి వెళ్లే రోడ్డును చెత్తాచెదారంతో నింపేశారు. దీనికితోడు అక్కడే కూర్చొని మందు బాబులు మందు తాగి వీరంగం సృష్టిస్తున్నారని, ఇప్పటికైనా ఇటు మున్సిపల్, పోలీసు అధికారులు దృష్టిసారించి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

'అక్రమ మైనింగ్‌ను అరికట్టాలి'


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

సుభాష్‌నగర్: మైనింగ్, రెవెన్యూ, పర్యావరణ శాఖల సమన్వయంతో ఉమ్మడి జిల్లాలో అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పర్యావరణ ఇంజినీర్ లక్ష్మణ్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ.. కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లో కొన్ని మైనింగ్ సంస్థలు పర్యావరణ అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపడుతున్నాయని ఆరోపించారు. గతంలో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఈ విషయంలో హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పర్యావరణ అనుమతులు తీసుకున్న తర్వాతే మైనింగ్ లైసెన్సులు జారీ చేసే విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. బట్టాపూర్‌లో జరిగే మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టం 2005 పరిధిలో వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి మైనింగ్ రికార్డులను పరిశీలించారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు, సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వీఎస్ వర్మ పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


ప్రదర్శన ద్వారా వివరిస్తున్న కళాజాత బృందం సభ్యులు, పోలీసులు

ఖలీల్ వాడి: నిజామాబాద్ పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పోలీసులు కళాజాత ద్వారా ప్రజలకు ఆన్‌లైన్ మోసాలు, మత్తు పదార్థాల వ్యసనాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. మహిళల భద్రత కోసం షీ టీమ్ ఉందన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే నిజామాబాద్ షీ టీమ్(8712659795) లేదా డయల్ 100కి ఫోన్ చేయాలని చెప్పారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని వివరించారు. మోసాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేయాలని సూచించారు.

గల్ఫ్ దేశాలకు వెళ్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ ఏజెంట్లు నిరుద్యోగులకు మాయ మాటలు, లేనిపోని ఆశలు, ఆత్యాశలు చూపించి మోసం చేస్తున్నారని వివరించారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సై ప్రవీణ్ గారు, కళాబందం సభ్యులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి ఎన్ఆర్ఐల సన్మానం



నిజామాబాద్‌నాగారం: అమెరికా వెళ్లిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సభ్యులు ప్రత్యేకంగా సన్మానించారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై పార్టీ భవిష్యత్ కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డితో చర్చించారు. ప్రస్తుతం అధికారంలోకి రాకపోయినా భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీదేనని మంత్రి ధీమా వెలిబుచ్చారు. తెలంగాణలో సీఎం అంటే కేసీఆర్ అని ఇక్కడి తెలుగు వారు అనుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు సాగర్ కొత్త, రాజ్ భవాని, నవీన్ జలగం, భాస్కర్ మద్ది, రామ్ వాల, కరుణాకర్ పంచనేని, మాధవ్ కొన్లే, శివ కాలేరు, నాగేంద్ర సుంకరి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక

డిచ్‌పల్లి: ఎంపీపీ,వైస్ ఎంపీపీ పదవులకు శుక్రవారం ఎన్నిక జరగనుంది. ఉదయం 11 గంటలకు జెడ్పీ డిప్యూటీ సీఈవో సుందర రాజన్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించనున్నారు. ఎంపీపీగా నడిపల్లి -2 ఎంపీటీసీ చిన్నోల్ల నర్సయ్య, వైస్ ఎంపీపీగా అమృతాపూర్ ఎంపీటీసీ దండుగుల సాయిలు ఎన్నిక లాంఛనమేనని తెలుస్తోంది. డిచ్‌పల్లి మండలంలో మొత్తం 17 మంది ఎంపీటీసీలు ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జనవరి 8న ఎంపీపీ గద్దె భూమన్న, వైస్ ఎంపీపీ కులాచారి శ్యాంరావులపై జనవరి 8న 12 మంది ఎంపీటీసీలు నిజామాబాద్ ఆర్డీవోకు అవిశ్వాస తీర్మానం కోరుతూ దరఖాస్తు అందజేశారు. అనంతరం ఎంపీపీ గద్దె భూమన్న హైకోర్టును ఆశ్రయించగా కోర్టు స్టే ఇచ్చింది. దీంతో వైస్ ఎంపీపీపై అవిశ్వాసం ప్రవేశ పెట్టగా శ్యాంరావు పదవిని కోల్పోయారు. అనంతరం హైకోర్టు స్టే ఎత్తివేయడంతో మార్చి 30న ఎంపీపీపై అవిశ్వాసం ప్రవేశ పెట్టగా గద్దెభూమన్న తన పదవిని కోల్పోయారు. అనంతరం ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియలో జాప్యం చోటు చేసుకుంది. ఎట్టకేలకు పోలింగ్ ముగియడంతో ఈ నెల 24న (శుక్రవారం) డిచ్‌పల్లి ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు అధికారులు ఉత్తర్వు లు జారీ చేయడంతో ఎంపీటీసీలు ఊపిరి పీల్చుకున్నారు.

'పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలి'



సిరికొండ: జీలకు అదనపు ఆదాయం సమకూర్చేలా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని పీఆర్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ ఆదేశించారు. తూంపల్లిలో పల్లె ప్రగతిలో చేపట్టిన పనులను ఆయన గురువారం తనిఖీ చేశారు. నర్సరీ, వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, కంపోస్ట్ షెడ్, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. వాటి నిర్వహణ గురించి ఆయన పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌ను ప్రశ్నించారు. గ్రామస్తుల నుంచి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. డీపీవో తరుణ్ చక్రవర్తి, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ తదితరులున్నారు.

'శిక్షణతో ఆర్థికంగా ఎదగాలి'


సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం మహేశ్వర్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్(ఆర్ఎం) మహేశ్వర్ సూచించారు. డిచ్‌పల్లి ఆర్ఎస్ఈటీఐ ఆధ్వర్యంలో నెల రోజులుగా మహిళలకు ఇస్తున్న ఉచిత టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎం మహేశ్వర్ మాట్లాడుతూ.. నేర్చుకోవడం అనేది ఏ దశలోనూ ఆగకూడదని, నిరంతరం కొనసాగుతూ ఉండాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు బ్యాంకు ద్వారా రుణసదుపాయం కల్పిస్తామని తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి టూల్ కిట్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రంజిత్, నవీన్, శ్రీలత, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జాతరలో కుస్తీ పోటీలు



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మంచిప్ప గ్రామంలో బుద్ధ పూర్ణిమ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారు, గజ్జలమ్మల జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజల మధ్య సమైక్యత భావం, అన్యోన్యత, మత సామరస్యత పెంపొందించేందుకు జాతర దోహదపడుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహించగా, కర్నాటక, మహారాష్ట్రతోపాటు తెలంగాణ జిల్లాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. విజేతలకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. చివరి విజేతకు ఐదు తులాల వెండి కడియం బహూకరించారు. జాతర సందర్భంగా మంచిప్ప గ్రామంలో జడ కొప్పు కళాకారుల ఆధ్వర్యంలో జడ కొప్పు వేశారు. వీడీసీ అధ్యక్షుడు గోవూరు నరేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెత్తను వేర్వేరుగా సేకరించాలి


పరిశీలిస్తున్న పీఆర్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ

ధర్పల్లి: తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించిన తర్వాతే వాహనాల్లో డంపింగ్‌యార్డ్‌కు తరలించాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ అధికారులను ఆదేశించారు. మండలంలోని సీతాయిపేట్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డ్‌లను ఆయన గురువారం పరిశీలించారు. కంపోస్ట్ షెడ్లలో తడి చెత్తతో ఎరువును తయారుచేసి మొక్కలకు ఉపయోగించుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. డీపీవో తరుణ్ చక్రవర్తి, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో రాజేష్, ఏపీవో వినోద తదితరులున్నారు.

వైభవంగా గంగమ్మ తల్లి జాతర



బోర్గాం(పి)లో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గంగపుత్రులు, పూజలు చేస్తున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి)లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం గంగమ్మ తల్లి జాతర నిర్వహించారు. ఈసందర్భంగా బోనాలకు ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. గంగమ్మ తల్లి జాతర కార్యక్రమానికి ఎంపీ అర్వింద్ ధర్మపురి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగమ్మ చరిత్ర, కథను ఒగ్గు కళాకారులు వివరించారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శేఖర్, కాంగ్రెస్ ఫిషర్‌మెన్ జిల్లా అధ్యక్షుడు పసూల శ్రీనివాస్, నాయకులు జనార్ధన్, గంగాధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సందగిరి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిట్టాపల్లిలో..

డిచ్‌పల్లి: మిట్టాపల్లిలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం గంగమ్మ తల్లి జాతర నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగమ్మ చరిత్ర, కథను ఒగ్గు కళాకారులు వివరించారు. ప్రజలందరూ బాగుండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని గంగమ్మ తల్లిని ప్రార్థించారు. ఎంపీటీసీ బాల గంగాధర్, గంగపుత్ర సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,600	వెండి (కిలో)	91,500
22 క్యారెట్స్	67,895	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	26	40	గాజరుగడ్డ	30	50
బెండకాయ	25	50	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	50	75	దోసకాయ	15	30
దొండకాయ	25	50	ఆలుగడ్డ	25	40
బీన్సుకాయ	100	130	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	15	30	కరివేపాకు	40	70
మెంతికూర	50	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	80	చిక్కుడుకాయ	40	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు)- 10.45, 1.45,7.40,10.40
	ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్-(ఇంగ్లీష్)-4.45
స్క్రీన్-3	రాజు యాదవ్(తెలుగు)- 1.45, 4.40, 10.30, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు)- 1.15, ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (ఇంగ్లిష్) - 4.30, 7.45, 11.00
స్క్రీన్-2	శ్రీకాంత్ (హిందీ) - 1.15, రాజు యాదవ్ (తెలుగు) - 4.15, ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు) - 6.55
స్క్రీన్-3	దర్బీ ఫ్లవర్ (తెలుగు) - 1.25, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 4.05, శ్రీకాంత్ (హిందీ) - 7.00, సీడీ (క్రిమినల్ ఆర్ డెవిల్ (తెలుగు) - 10.00
స్క్రీన్ -4	బిగ్ బ్రదర్ (తెలుగు) - 11.25, సిల్క్ సారీ (తెలుగు) - 2.00, రాజు యాదవ్ (తెలుగు) - 7.50, 10.30
దేవి	రాజు యాదవ్
నటరాజ్	ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు)

వికసించిన 'మే' పుష్పాలు



నిజామాబాద్ నగరం వినాయక్‌నగర్‌లోని విశ్రాంత ఆచార్యుడు సేర్ల దయానంద్ ఇంట్లో గురువారం మూడు 'మే' పుష్పాలు వికసించాయి. వీటిని రెడ్ ఫుట్‌బాల్ పువ్వులు అని, అదేవిధంగా అరేబియన్ పువ్వులు అని కూడా పిలుస్తారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్